ఖరీఫ్‌లో విజృంభిస్తున్న తెగుళ్లు

- రైతన్నల ఆందోళన
- దిగుబడిపై తీవ్ర ప్రభావం
- పెరిగిపోతున్న పెట్టుబడి



ఎస్.లక్ష్మీ లావణ్య

ఆలమూరు: అన్నదాతలకు ఖరీఫ్ పంట తుది దశకు చేరుకుంటున్న సమయంలో తెగుళ్ల రూపంలో కష్టాలు వెంటాడుతున్నాయి. వాతావరణంలో సంభవించిన మార్పుల వల్ల వరి పంటపై తెగుళ్ల ముప్పేట దాడి చేస్తున్నాయి. ఆలమూరు, కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలోని 13 మండలాల్లో సుమారు 70 వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతుంది. ఇటీవల కాలంలో వాతావరణంలో ఉష్ణోగ్రతల వ్యత్యాసాల వల్ల ఖరీఫ్ పంటపై తీవ్ర ప్రతికూలం పరిస్థితులు సంభవిస్తున్నాయి. దీంతో వరి పంటకు బ్యాక్టీరియా ఎండు, తెగులు, మాగుడు, కాండం తొలుచు, ఎర్ర నల్లి తదితర తెగుళ్లు విజృంభించడంతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక పక్క పెరిగిపోతున్న పెట్టుబడి, నియంత్రణలోకి రాని తెగుళ్లతో వారు సతమతమవుతున్నారు. ఖరీఫ్‌లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ సూచిస్తున్నా ఫలితం లేకపోతుంది. ఖరీఫ్ సాగు ఆరంభంలోనే వర్షాభావ పరిస్థితులు పంటకు నష్టాన్ని కలగజేస్తే, మధ్య దశలో ఉష్ణోగ్రతలు పెరిగిపోయి పంటను దెబ్బతీస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. పురుగు మందులు మితంగా వాడి సస్యరక్షణ చర్యలు చేపడితే తెగుళ్ల నివారణ కొంత మేరకు సాధ్యమేనని వ్యవసాయశాఖ చెబుతుంది.



పినపళ్లలో వరి తెగుళ్ల నివారణకు క్రిమి సంహారక మందును పిచికారీ చేస్తున్న దృశ్యం

పాటించాల్సిన జాగ్రత్తలివి..

వరి పంటపై ఆశించే తెగుళ్ల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీలావణ్య అన్నారు. ప్రస్తుతం ఖరీఫ్‌లో నల్లి, బ్యాక్టీరియా ఎండు తెగులు ప్రభావం అధికంగా ఉందన్నారు. ఎర్ర నల్లి తెగులు నివారణ కోసం మూడు గ్రాముల పొడి గంధాన్ని లీటరు నీటిలో పిచికారీ చేయాలన్నారు. అలాగే బ్యాక్టీరియా ఎండు తెగులు నివారణ కోసం ఒక గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ కాని ప్లాంటా మైసిన్ మందును కాని పది లీటర్ల మందులో కలిపి పిచికారీ చేస్తే చక్కని ఫలితాలు లభిస్తాయన్నారు. అలాగే వ్యవసాయశాఖ సూచనలు, సలహాలు పాటించడం ద్వారా క్రిమి సంహారక మందుల భారం తగ్గించుకోవచ్చని సూచించారు.

ఖరీఫ్‌పై తెగుళ్ల దాడి

వరి పంటకు సోకుతున్న తెగుళ్ల నివారణకు రైతులు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించవలసిన పరిస్థితి. మాగుడు తెగులు వల్ల ఆకులపై మచ్చలు ఏర్పడి వరి దుబ్బులు ఎండిపోతున్నాయి. కాండం తొలచు పురుగు తెగులు ప్రభావంతో దుబ్బు మధ్యలో మొవ్వ ఎండిపోతుంది. దీనివల్ల వరి వెన్ను విరిగిపోయి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఆకులపై ఉన్న పత్ర హరితాన్ని ఎర్రనల్లి తెగులు తినేస్తుండటంతో ఆకులపై మచ్చలు ఏర్పడి క్రమేపీ దుబ్బు రంగు మారిపోతుంది. ఈ తెగుళ్ల ప్రభావం వల్ల పెట్టుబడి ఎకరాకు దాదాపు రూ.1500 నుంచి రూ.రెండు వేల వరకూ పెరిగిపోవడంతో పాటు దిగుబడి తగ్గిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

ఏపీపీటీడీకి గుర్తింపుపై సంబరాలు



డిపో కార్యాలయంలో సంబరాలు చేసుకున్న యూనియన్ నాయకులు

రాజోలు: రాష్ట్ర ప్రభుత్వం ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్‌కు గుర్తింపు ఇవ్వడంపై రాజోలు ఆర్టీసీ ఉద్యోగులు బుధవారం సంబరాలు నిర్వహించారు. డిపో వద్ద గేట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి జగన్, ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావుకు కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్‌కు గుర్తింపు ఇవ్వడంపై మిఠాయిలు పంచారు. డిపో కార్యదర్శి ఎంఎస్ఆర్ మూర్తి, ఏవీఆర్ నాయుడు, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ పీవీ బాబు, గ్యారేజీ కార్యదర్శి పీఎస్ ప్రకాష్, వై.శ్రీనివాస్, వైవీఎస్ ప్రసాద్, జె.రూపేష్, బీఆర్ సందీప్, డీఆర్ రాజు, ఎం.జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి వితరణ



గుమ్మిలేరులో దాత ప్రసాద్ సహకారంతో నిర్మించిన షెడ్డు ప్రారంభిస్తున్న సర్పంచ్

ఆలమూరు: గుమ్మిలేరులోని మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యను అభ్యసించి ఉన్నత స్థానానికి చేరుకున్న గ్రామానికి చెందిన వల్లూరి ప్రసాద్ పాఠశాలకు రూ.60 వేలతో షెడ్డును ఏర్పాటు చేశారు. సర్పంచ్ గుణ్ణం రాంబాబు బుధవారం ఆ షెడ్డును ప్రారంభించారు. ఎంఈఓలు పి.షాలెంరాజు, పి.సుబ్బరాజు, ఉపాధ్యాయుల బృందం దాత ప్రసాద్‌ను అభినందించారు.

ఎమ్మెల్యేకు జెడ్పీ చైర్మన్ పరామర్శ



ఎమ్మెల్యే చిట్టిబాబును పరామర్శిస్తున్న రాజోలు ఎమ్మెల్యే వరప్రసాదరావు

మామిడికుదురు: పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును బుధవారం జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పరామర్శించారు. నగరంలోని తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే చిట్టిబాబు యోగక్షేమాలను చైర్మన్ వేణుగోపాలరావు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. మండల పరిషత్ అధ్యక్షురాలు కుసుమ వనజ కుమారి, వైఎస్సార్ సీపీ నేతలు కుసుమ శ్రీధర్, అడ్డగళ్ల శ్రీను, కుసుమ పెరుమాళ్లకుమార్, వాకపల్లి వీరాస్వామి, కాండ్రేగుల శ్రీనివాస్, నేతల నాగరాజు తదితరులు చిట్టిబాబును పరామర్శించి త్వరగా కోలుకోవాలని అభిలాషించారు.

ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులు



తొండవరంలో బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, స్థానికులు

అంబాజీపేట: విద్యార్థులను క్రమశిక్షణ, వారి ఉజ్వల భవిష్యత్‌కు తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులవుతారని సర్పంచ్ పేరాబత్తుల రామలింగరాజు (దొరబాబు) అన్నారు. తొండవరం జెడ్పీ హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తూ పదోన్నతి, బదిలీపై వెళ్లిన హెచ్ఎం, ఉపాధ్యాయుల సన్మాన సభ హెచ్ఎం పీవీ కేశవాచార్యుల అధ్యక్షతన బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ అంబాజీపేట ఎంఈఓ-2గా పదోన్నతి పొందిన మోకా ప్రకాష్‌ను, స్కూల్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తూ తొత్తరమూడి హైస్కూల్‌కు వెళ్లిన అందె మల్లేశ్వరరావును, రంగంపేట హైస్కూల్‌కు బదిలీపై వెళ్లిన ఐఏఎస్ భారతిలను ఘనంగా సత్కరించారు. సన్మాన సభలో పీఎంసీ చైర్మన్ బొంతు భాస్కరరావు, కేతా రాజు, గోసంగి కుమారస్వామి, ఉపాధ్యాయులు మట్టపర్తి రాంబాబు, బి.శ్రీరామంజనేయులు, కొంపెల్ల వాణి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజోలు మండలం శివకోడుకు చెందిన బోళ్ల శ్రీనివాస్ కుటుంబ సభ్యులు బుధవారం రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తికి అందజేశారు. దాతను స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

స్కూల్ గేమ్స్ విన్నర్ టీమ్స్ ఇవే..



కొత్తపేటలో బాలికల ఖోఖో విన్నర్, రన్నర్ టీమ్స్‌తో ఎంఈఓ హరిప్రసాద్, మండల గేమ్స్ కోఆర్డినేటర్ ఉషారాణి, పీడీ, పీఈటీలు

కొత్తపేట: మండల స్థాయిలో రెండు రోజుల పాటు జరిగిన స్కూల్ గేమ్స్‌లో విన్నర్ టీమ్స్‌ను బుధవారం సాయంత్రం ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, మండల గేమ్స్ కో ఆర్డినేటర్ వైఎస్ఎస్ ఉషారాణి ప్రకటించారు. మంగళవారం బాలుర పోటీలు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో, బాలికల పోటీలు జెడ్పీ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో నిర్వహించారు.

బాలికల టీమ్స్..

బాలికల విభాగంలో అండర్ 14, 17 రెండింటా కబడ్డీ విన్నర్‌గా వానపల్లి, రన్నర్స్ కొత్తపేట, ఖోఖో అండర్-14 వానపల్లి, కొత్తపేట, అండర్-17 కొత్తపేట, వానపల్లి, వాలీబాల్ అండర్-14 వానపల్లి, చప్పిడివారిపాలెం, అండర్-17 చప్పిడివారిపాలెం, వానపల్లి, త్రోబాల్ అండర్-14 చప్పిడివారిపాలెం, వానపల్లి, అండర్-17 చప్పిడివారిపాలెం, కొత్తపేట, టెన్నికాయిట్ రెండు విభాగాల్లో వానపల్లి, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్‌లలో అండర్-14 కొత్తపేట, వాడపాలెం, అండర్-17 వాడపాలెం, కొత్తపేట విజేతలుగా నిలిచారు.

బాలుర టీమ్స్..

బాలుర విభాగంలో అండర్-14 కబడ్డీ విన్నర్‌గా మందపల్లి, రన్నర్‌గా వానపల్లి, అండర్-17 వానపల్లి, గంటి, ఖోఖో అండర్-14 వాడపాలెం, కొత్తపేట, అండర్-17 వాడపాలెం, మోడేకుర్రు, వాలీబాల్ అండర్-14 చప్పిడివారిపాలెం, పలివెల, అండర్-17 పలివెల, వానపల్లి, త్రోబాల్ అండర్-14 చప్పిడివారిపాలెం, కొత్తపేట, అండర్-17 కొత్తపేట, చప్పిడివారిపాలెం, టెన్నికాయిట్ అండర్-14 విన్నర్, రన్నర్ వానపల్లి, అండర్-17 మోడేకుర్రు, వానపల్లి, షటిల్ బ్యాడ్మింటన్ అండర్-14 కొత్తపేట, వాడపాలెం, అండర్-17 వాడపాలెం, మోడేకుర్రు, బాల్ బ్యాడ్మింటన్‌లలో అండర్-14 వాడపాలెం, కొత్తపేట, అండర్-17 వాడపాలెం, మందపల్లి విజేతలుగా నిలిచారు.

ఇతర రాష్ట్రాలకు మన పథకాలు ఆదర్శం

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- కొత్తపేటలో గడప గడపకూ..



కొత్తపేటలో మహిళకు పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: రాష్ట్రంలో అమలు జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. కొత్తపేటలో బుధవారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక భారత్ పెట్రోల్ బంకు నుంచి కొత్తపాలెం వరకూ ఇంటింటికీ వెళ్లి ఈ నాలుగేళ్లలో ఆయా కుటుంబాల్లో లబ్ధిదారులకు వివిధ పథకాల ద్వారా చేకూర్చిన లబ్ధిని వివరించారు. ఇంకా మీకేమైనా సమస్యలు ఉన్నాయా? ఉంటే చెప్పండి! పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, ఎంపీటీసీ బొక్కా నాగరాణి, సర్పంచ్‌లు రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, ఏఎంసీ డైరెక్టర్ సాకా జానకి రామరాజు, పీఏసీఎస్ పర్సన్ డీఎస్, గ్రామ పార్టీ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సంబంధాల బలంతో దేశాభివృద్ధి



కొత్తపేట డిగ్రీ కళాశాలలో జీ-20పై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దిరాజు

కొత్తపేట: ప్రపంచ దేశాలన్నీ ఏకమై ఒక కూటమిగా ఏర్పడటం వలన అంతర్జాతీయ సంబంధాలు మరింత బలపడి భారతదేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు అన్నారు. కళాశాలలో బుధవారం పొలిటికల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ పెద్దిరాజు అధ్యక్షతన 'జీ-20'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రాంతీయ అంశాలే కాక జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న అంశాలను తెలుసుకుని జనరల్ నాలెడ్జ్‌ను పెంపొందించుకోవాలని సూచించారు. దానిలో భాగంగానే ప్రస్తుతం 'జీ-20' గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈ కూటమి ఎప్పుడూ ఏర్పడింది. ఏఏ దేశాల్లో సదస్సులు జరిగాయి. ఎలా జరుగుతాయి వంటి అనేక అంశాలు వివరించారు. ముఖ్యంగా 'జీ-20' అనేది ప్రపంచ దేశాలన్నింటినీ ఆర్థికంగా పటిష్టం చేయడానికి ఏర్పాటయిందని, ఈ సదస్సుకు ఒక్కో సంవత్సరం ఒక్కో దేశం ఆతిథ్యం ఇస్తుందన్నారు. ఈసారి ఆ అవకాశం భారత్ను వరించిందన్నారు. మన భారత ప్రధాని మోదీ ఈ అవకాశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తున్నారన్నారు. 20 ప్రపంచ దేశాలన్నీ ఏకమై ఒక కూటమిగా నిర్వహించే ఈ సదస్సులో అనేక ఆర్థిక పరమైన అంశాలు చర్చించి ప్రణాళికా బద్ధమైన నిర్ణయాలు తీసుకుంటారన్నారు. ఈ సదస్సులో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, పొలిటికల్ సైన్స్ హెచ్ఓడీ వి.నాగదీపిక, వివిధ డిపార్ట్‌మెంట్స్ హెడ్స్ డీసీహెచ్ పాపారావు, సీహెచ్ భవాని తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పారదర్శకంగా పాలన



పాశర్లపూడి సమావేశంలో మాట్లాడుతున్న జేసీఎస్ ఇన్‌చార్జ్ వాసు

మామిడికుదురు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా పాలన నిర్వహిస్తున్నారని మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ జక్కంపూడి వాసు పేర్కొన్నారు. పాశర్లపూడి, బి.దొడ్డవరం, పెదపట్నం గ్రామాల్లో బుధవారం గృహ సారథుల ఇన్సూరెన్స్ నమోదు సమావేశాల్లో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ తరఫున గృహ సారథులకు ఇన్సూరెన్సు సదుపాయం ఏర్పాటు చేసిందన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడం, ప్రజల్లో చైతన్యం తీసుకురావడం కోసం కృషి చేయాలన్నారు. సమావేశాల్లో పార్టీ నేతలు చిక్కం బుజ్జిబాబు, నెల్లి దుర్గాప్రసాద్, అంకాని వీరాంజనేయులు, మొల్లేటి త్రిమూర్తులు, తోరం భాస్కర్, యూవీవీ సత్యనారాయణ, వాకపల్లి వీరాస్వామి, కాండ్రేగుల శ్రీనివాస్, కొమ్ముల చిన్న, కొమ్ముల శ్రీను, గుండాబత్తుల గోవిందరావు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన ఉండాలి

కొత్తపేట: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్స్ పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి (డీఎస్‌డబ్ల్యుఓ) పి.జ్యోతిలక్ష్మీదేవి సూచించారు. సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం మండలాల్లో పనిచేస్తున్న వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లకు వివిధ అంశాలపై వర్క్‌షాపు నిర్వహించారు. రాజోలు సహాయ సాంఘిక సంక్షేమ వెల్ఫేర్ ఆఫీసర్ కేవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో లక్ష్మీదేవి మాట్లాడుతూ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళి, పనిలో నిబద్ధత, పౌరుల పట్ల మర్యాద, పౌరులు అడిగిన దానికి ఓర్పుగా సరైన సమాధానం చెప్పడం వంటి అంశాలను వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం, జీఓల గురించి తెలుసుకోవాలని సూచించారు. ముఖ్యంగా జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్య, వైఎస్సార్ కల్యాణమస్తు, డప్పు, చర్మ, కళాకారుల పింఛన్ల మంజూరులో పాటించవలసిన నియమ నిబంధనలు క్షుణ్ణంగా తెలుసుకుని, అర్హులందరికీ మంజూరయ్యేలా చూడాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ ఈ మహేశ్వరరావు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు హేమలత, కె.సత్యవతి, జి.పవన్‌కుమార్, డీపీఓ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గణపతి మాలధారుల పాదయాత్ర

అయినవిల్లి: అంకంపాలెం నుంచి అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయానికి గణపతి మాలధారులు పాదయాత్ర ద్వారా బుధవారం చేరుకున్నారు. సుమారుగా ఏడు గంటల పాటు అంకంపాలెం, ర్యాలి, రావులపాలెం, కొత్తపేట, వానపల్లి మీదుగా ప్రయాణించి అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయానికి చేరుకున్నారు. అయినవిల్లి విఘ్నేశ్వరుని దర్శించి స్వామికి ఇరుముడులు చెల్లించారు.

సుమారుగా 11 మంది గణపతి మాలధారులు చేరుకున్నారు. వీరికి ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు.

క్రీడలతో మానసికోల్లాసం



పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు

అయినవిల్లి: క్రీడలతో మానసికోల్లాసం అలవడుతోందని స్థానిక జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ముక్తేశ్వరం జెడ్పీ హైస్కూల్లో మండల స్థాయి బాలికల అండర్ 14-17 కేటగిరి క్రీడల పోటీలను ఆయన ప్రారంభించారు. 150 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుడుపూడి శాంతావతి, ప్రధానోపాధ్యాయుడు నిమ్మకాయల గణేశ్వరరావు, ఏఈఓ శ్రీను తదితరులు ఉన్నారు.

రావులపాలెంలో..

రావులపాలెం: గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ మండల స్థాయి పోటీలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజున అండర్ 14, 17 విభాగాల్లో బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, యోగాలో పోటీ నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూల్ నుంచి 290 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. మండల స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయికి బాలురు నుంచి 57 మందిని, బాలికల నుంచి 52 మందిని ఎంపిక చేసినట్లు మండల కోఆర్డినేటర్ లక్ష్మీప్రసూన తెలిపారు.

నేడు సచివాలయ భవనం ప్రారంభం

కొత్తపేట: స్థానిక నాలుగో సచివాలయం పరిధిలో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీపీ ఎం.గంగాధరరావు తెలిపారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పాల్గొంటారన్నారు. మండల పరిషత్ కాంపౌండ్ రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం-4 నూతన భవనాన్ని సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఎంపీపీ పిలుపునిచ్చారు.

దినదిన గండం.. అటుగా ప్రయాణం



అధ్వానంగా మారిన మామిడికుదురు కొర్లగుంట రోడ్డు

మామిడికుదురు: స్థానిక 216వ నంబర్ జాతీయ రహదారి నుంచి కొర్లగుంట వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుపై వేసిన గ్రావెల్ బురదమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షానికే ఈ రోడ్డు చిత్తడిగా మారుతోంది. దీంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం గ్రామాలకు వెళ్లే వారికి ఈ మార్గం దగ్గర దారి. దీంతో ప్రతి రోజు వందలాది మంది ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు బురదమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రెండు చోట్ల సుమారు 100 మీటర్ల మేర రోడ్డు చిత్తడిగా మారుతోంది. కొద్దిపాటి చినుకులు పడినా అవస్థలు తప్పడం లేదు. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించి ఈ రోడ్డును అభివృద్ధి చేసే దిశగా దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం ఇవ్వాలి



ఎంపీడీఓ భారతికి వినతిపత్రం సమర్పిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

పి.గన్నవరం: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించి, రెగ్యులర్ చేయాలని కోరుతూ రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు మండలంలోని ఫీల్డు అసిస్టెంట్లు బుధవారం ఎంపీడీఓ ఎం.భారతికి వినతిపత్రం సమర్పించారు. టార్గెట్ విధానాన్ని రద్దు చేసి, అందరినీ ఫీల్డు అసిస్టెంట్లుగానే గుర్తించాలని వారు కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో రాష్ట్ర యూనియన్ అధ్యక్షుడు మేడిది పరంధామయ్య, జిల్లా కోశాధికారి వెంగళరావు, ఎ.ప్రసాద్, ఎస్.సుబ్బరాజు, భవాని, చింతపర్తి సీమయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

అంబాజీపేట: బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పాలన చేస్తున్నారని సర్పంచ్ కోట బేబీరాణి, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు అన్నారు. చిరతపూడిలో నూతనంగా మంజూరైన పింఛన్లను బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. వారు మాట్లాడుతూ అర్హత కలిగి ఉంటే పింఛన్ వస్తుందని, రాని వారు అధైర్యపడవద్దని త్వరలో వారికి ఇస్తామన్నారు. అనంతరం నూతన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు, గృహ సారథులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం ఏర్పాటుకు టెండర్లు

రాజోలు: ఆర్టీసీ నిర్వహిస్తున్న పెట్రోలు బంక్ ఆవరణలో ఏటీఎం ఏర్పాటు చేసుకునేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు రాజోలు ఇన్‌చార్జి ఆర్టీసీ డిపో మేనేజర్ సీహెచ్‌వీఎస్ఎన్ మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏటీఎంతో పాటు డిపో ఆవరణలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, డిపో ఆవరణలో చెట్ల ఫలసాయం హక్కులు పొందేందుకు టెండర్లు దాఖలు చేసుకోవచ్చన్నారు. రూ.295 చెల్లించి ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆర్టీసీ కార్యాలయం, 21వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట వరకు టెండర్ ఫారాలు పొందవచ్చన్నారు. అదే రోజు 3 గంటలకు సీలు వేసిన టెండరు బాక్స్‌ను టెండరుదారుల సమక్షంలో తెరుస్తామన్నారు.

నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

అంబాజీపేట: నాడు-నేడు పథకంలో భాగంగా నిర్మిస్తున్న భవనాలను, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈఓ మోకా ప్రకాష్ అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పథకం ద్వారా రూ.10 లక్షలతో భవన నిర్మాణం జరుగుతుందని, దానిలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించామన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థుల నైపుణ్యాన్ని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. సీఆర్పీ జి.సత్యనారాయణ ఎంఈఓ వెంట ఉన్నారు.

చిన్నారులకు టీకాలు వేయించాలి

అంబాజీపేట: పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు టీకాలు తప్పని సరిగా చేయించాలని అంబాజీపేట పీహెచ్‌సీఈ సీహెచ్‌వో బి.అప్పారావు అన్నారు. మాచవరం సచివాలయం 2, 4లలో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చిన్నారులకు టీకాలు వేయించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. చిన్నారులకు టీకాలు వేయించడం వల్ల కలిగే ప్రయోజనాలను వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. హెచ్‌వి ఎస్.శాంతకుమారి, ఏఎన్ఎం తులసి, అర్జమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రాజోలు: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో అమలాపురం కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎంఈఓ నల్లి మనోహరం శిబిరాన్ని ప్రారంభించారు. విద్యార్థులు దంతాలను సంరక్షించుకునే విధానాలపై డాక్టర్ కార్తీక్ ఈశ్వర్ అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయిని కె.సరస్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపటి లోపు ఈ-పంట నమోదు చేయించుకోవాలి

అంబాజీపేట: ఉద్యాన పంటలకు సంబంధించి ప్రతి రైతు ఈ నెల 15వ తేదీ లోపు ఈ-పంట నమోదును చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ తెలిపారు. కొబ్బరితో పాటు, కొబ్బరిలో అంతర పంటలుగా సాగు చేస్తున్న అరటి, ఖోకో, పోక తదితర ఉద్యాన పంటలకు సంబంధించిన వివరాలను ఆయా గ్రామాల్లో వీఏహెచ్, వీఏఏలకు తెలియజేసి నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే వరి పంటకు సంబంధించి ఈ నెల 25వ తేదీ వరకు ఈ-పంట నమోదు చేసుకునేందుకు సమయం ఉందన్నారు. ప్రతి రైతు ఈ-పంట నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు.

కల్యాణ మండపం పనుల పరిశీలన

ఆలమూరు: మండలంలోని చొప్పెల్లలో నిర్మాణంలో ఉన్న కాపు కల్యాణ మండపం పనులను బుధవారం ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి పరిశీలించారు. పనులను వేగవంతం చేసి డిసెంబర్ నెలాఖరు నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్లకు విజ్ఞప్తి చేశారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దన్నారు. కాపు కల్యాణ మండప నిర్మాణానికి సహకరిస్తున్న కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. సర్పంచ్ దంగేటి చంద్రకళ, మాజీ ఎంపీటీసీ దియ్యన వీర్రాజు, గానుగుల పట్టాభి రామన్న, తోరాటి రాంబాబు పాల్గొన్నారు.

టీడీపీ రిలే దీక్షలు

పి.గన్నవరం: చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ పి.గన్నవరంలో అంబాజీపేట మండలానికి చెందిన టీడీపీ నాయకులు బుధవారం రిలే దీక్షలు నిర్వహించారు. టీడీపీ అమలాపురం పార్లమెంటు ఇన్‌చార్జి జి.హరీష్ మాధుర్, నాయకులు నామన రాంబాబు, డొక్కా నాథ్‌బాబు, తోలేటి సత్తిబాబు, దంతులూరి శ్రీనివాసరాజు, గుడాల ఫణి, గణపతి వీరరాఘవులు, దాసరి వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావులపాలెం: మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కోసం శుక్రవారం ఆదిలక్ష్మీనగర్, ఊబలంక విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు ఆదిలక్ష్మీనగర్ స్టేషన్ పరిధిలోని, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు ఊబలంక స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.